క్లుప్తంగా

తాపేశ్వరంలో నేటి నుంచి విశేష పూజలు



తాపేశ్వరంలో ఆధునీకరించిన ఉమా అగస్త్యేశ్వరస్వామి ఆలయం

మండపేట: తాపేశ్వరంలోని ఉమాఅగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లికార్జున రావు (మల్లిబాబు) దాతల సహకారంతో స్వామివారి ఆలయాన్ని ఆధునీకరించిన విషయం విధితమే. ఉగాదిని పురస్కరించుకుని ఈ ఆలయంలో ప్రత్యేక పూజలకు శ్రీకారం చుట్టారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు విశేష పూజాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు



వెంటూరు సోమేశ్వరాలయంలో లక్ష పత్రి పూజ చేస్తున్న వేద పండితులు

రాయవరం: మండలంలోని వెంటూరులో వేంచేసిన పార్వతీ సమేత సోమేశ్వరాలయంలో శుక్రవారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. అష్ట సోమేశ్వరాలయాల్లో ఒకటిగా వెలుగొందుతున్న ఆలయంలో మహా శివుడికి లక్షపత్రి పూజ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. వేద పండితులు పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన, స్వామివారికి దీప, ధూపసేవ, లింగార్చన, సూర్య నమస్కారాలు, శాంతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యుడు పొక్కులూరి సుబ్బారావు సౌజన్యంతో అన్నసమారాధన చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో తటవర్తి రాఘవ రాజు, దువ్వూరి శ్రీరామశర్మ, పీవీఎస్ సూర్య నారాయణ, వాడ్రేవు వెంకట్రావు, వింజమూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



సైథిల్‌పేటలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పరిశీలించారు. 24వ వార్డు సైథిల్‌పేటలో డ్రైన్లలో పూడిక తీత పనులు, ఇటీవల శుభ్రం చేసిన రామచంద్రుడు కాలువ గట్టును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం 28వ వార్డు వాటర్ వర్క్సులోని వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్టు తయారీపై ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజును ఆరా తీశారు. చైర్‌పర్సన్ వెంట వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, మొండి మురళి, శానిటరీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పాస్టర్ మృతి తీరని లోటు

కె.గంగవరం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి తీరని లోటని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డి.ఏలియా అన్నారు. కె.గంగవరంలోని దీవెన గ్రౌండ్స్ వద్ద శుక్రవారం పాస్టర్ ప్రవీణ్ పడగాలకు సంతాప సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు ఉన్నాయని ప్రభుత్వం నిజానిజాలను వెలికితీయాలన్నారు. పాస్టర్స్ ఎం.జాన్‌బాబు, ఎస్.రిచర్డ్స్ సామ్యేల్, పి.జార్జి పాల్, జి.అనిల్‌బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



మహిళలకు నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట: ప్రధానమంత్రి అనుసుచిత్ జాతీయ అభ్యుదయ యోజనలో భాగంగా సెర్ప్ ఉన్నతి పథకం ద్వారా మంజూరైన రూ.10.50 లక్షల విలువైన చెక్కులను శుక్రవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక వికాసానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పర్వతిన వీర్రాజు, వేగ్గళ్ల రామకృష్ణ, నూని వీర్రాజు, బొజ్జా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అణచివేతకు పాల్పడితే సహించం

- అధికారుల తీరుపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం
- సంక్షేమాన్ని విస్మరిస్తున్నారంటూ అసహనం
- వాడీవేడిగా కపిలేశ్వరపురం బడ్జెట్ సమావేశం



సమావేశంలో పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: ప్రజలు ఎన్నుకున్న సర్పంచులు, ఎంపీటీసీలపై అధికారులు అణచివేత చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి అజెండాను చదివి వినిపించారు. సభ్యులు పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారుల తీరును ఎండగట్టారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా సమావేశానికి గైర్హాజరైన అధికారుల సంగతి గత సమావేశంలోనే అనుకొన్నట్టుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీఓ కె.రత్నకుమారిని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు గైర్హాజరు కావడాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు.

బిల్లులు చెల్లించకపోవడంపై మండిపాటు

నేలటూరు, తాతపూడి గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు తొమ్మిది నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంపై ఎమ్మెల్సీ తోట మండిపడ్డారు. దీనిపై ఎంపీడీఓ కె.రత్నకుమారి, ఇతర అధికారులను నిలదీశారు. వ్యయప్రయాసలకు ఓర్చి పనులు చేపడితే బిల్లులు ఆపడమేంటని, గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి వివక్ష ఎప్పుడైనా చూపామా ? అని ప్రశ్నించారు. చేసిన పనులకు బిల్లు ఇవ్వడానికి ఎవరి అనుమతి కావాలని, సర్పంచ్‌లు పోయి ఎవరి కాళ్లు పట్టుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నేలటూరు, తాతపూడి పంచాయతీ కార్యదర్శులు అసంబద్ధమైన సమాధానం చెప్పడాన్ని సభ్యులు తప్పుబట్టారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని గాలికొదిలేసిందనడానికి సుమారు 3 లక్షల పింఛన్లను తొలగించడం, 9 లక్షల పింఛను దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడమే నిదర్శనమన్నారు. కూటమి నేతలు వారిచ్చిన హామీలు గురించి మాట్లాడటం లేదని ఆ విషయాన్ని గట్టిగా ప్రశ్నిస్తుంటే గతంలో మీరేంచేశారంటూ అర్థంపర్థం లేని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలోని వ్యవస్థలను కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేస్తోందన్నారు. అధికారులు కూటమి నేతలు చెప్పిన అణచివేత పనులు చేయడం మాని ప్రజలకు మంచి చేయాలన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా పీఆర్ జేఈ రాఘవులు మాట్లాడుతూ మండలంలో పలు సచివాలయాలు, వైఎస్సార్ క్లినిక్‌లు చివరి దశలో ఉన్నాయన్నారు. సుమారు రూ.4 లక్షలు చొప్పున నిధులను సమకూర్చితే వాటిని వినియోగంలోకి తెచ్చుకోవచ్చన్నారు. నిధుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని తోట సలహా ఇచ్చారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ తమను ఎన్నుకున్న గ్రామస్తులకు మేలు చేయాలన్న తపనతో గ్రామాభివృద్ధికి ముందుకు వెళ్తుంటే అధికార కూటమి పార్టీల నాయకులు అడ్డుపడుతున్నారన్నారు. పంచాయతీ పాలకవర్గం ప్రమేయం లేకుండా ప్రభుత్వ అండదండలతో నేరుగా వర్కులు చేసేస్తున్నారన్నారు. అధికారులు కూటమి నేతలకు వత్తాసు పలుకుతున్నారని పలువురు సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లో పెత్తనం సాగిస్తున్నారన్నారు.

అంచనా బడ్జెట్ ఆమోదం

2024–25 సంవత్సరం సవరణ, 2025–26 అంచనా బడ్జెట్‌లకు సమావేశం ఆమోదం తెలిపింది. 2024–25 అంచనా బడ్జెట్‌లో అన్ని పద్దుల ఆదాయం రూ.70,03,00,000 గానూ, 2025–26 అంచనా బడ్జెట్ అన్ని పద్దుల వ్యయం రూ.10, 02, 28,000 గానూ చూపించారు. కాగా రూ.72 వేలు మిగులు బడ్జెట్‌గా తేల్చారు. 2024–25 సవరణ బడ్జెట్‌లో రూ.98,60,000, 2025–26 అంచనా బడ్జెట్‌లో రూ.1,09,40,000 ఆదాయంగా చూపించారు. 2024–25 సవరణ బడ్జెట్‌లో రూ.86లక్షలు ఆదాయంగానూ, 2025–26లో రూ.86 లక్షలు వ్యయంగానూ చూపిస్తూ, ఆ వ్యయాన్ని 15వ ఆర్థికసంఘం నిబంధనలకు లోబడి ఖర్చు చేసినట్టు తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి



ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ సెంటర్

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో అన్ని రకాల ఆధార్ సేవలను అందించడం జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని హెడ్ పోస్టుమాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ నవీకరణతో పాటుగా, వేలిముద్రలు, మొబైల్ లింక్, చిరునామా మార్పులు, వంటివి ఆధార్ కౌంటర్ ఇన్‌చార్జి జానకి రామారావు నేతృత్వంలో చేస్తామన్నారు. సవరణలకు సంబంధించి అవసరమైన పత్రాలను అందించి, ఆధార్ సవరణలు చేసుకోవచ్చన్నారు. చిన్నపిల్లలకు ఆధార్ నవీకరణ చేయటంతో పాటుగా వేలిముద్రలు తీసుకుంటామన్నారు. ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డులను ఇస్తే మధ్యాహ్నం 3 గంటల వరకు ఆధార్ కౌంటర్ పని చేస్తుందన్నారు. ప్రతి రోజు 70 నుంచి 100 మంది వరకు పోస్టాఫీస్‌లో సేవలను వినియోగించుకొంటున్నట్లు హెడ్ పోస్టుమాస్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. డీపీఎం సీతామహాలక్ష్మి, రాంబాబు, గణపతి, రాయుడు వెంకటేశ్వరరావు, ఏడుకొండలు తదితర పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్ష చేస్తున్న 28, 29, 30 వార్డుల ప్రజలు

మండపేట: మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా పట్టణంలోని 28, 29, 30 వార్డుల ప్రజలు చేస్తున్న రిలే నిరాహార ఏడో రోజు శుక్రవారం కొనసాగాయి. స్థానిక సత్యశ్రీ రోడ్డులోని సప్తగిరి థియేటర్ వద్ద వైన్ షాపు ఎదురుగా మహిళలు దీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇళ్ల మధ్య మద్యం షాపు వద్దంటూ మండుటెండలో పనులు మానుకుని నిరసన తెలుపుతున్నా అధికారులు తమపై కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ, ప్రజామోదం లేకుండా మద్యం దుకాణాలు ఇళ్ల మధ్యలోకి ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. షాపు తీసేంత వరకూ ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు. దీక్షల్లో పిల్లి నాగమణి, కేతా దేవి, ఎం.కుమారి, వనపర్తి రాజ్యలక్ష్మి, పిల్లి పద్మ, పిల్లి లక్ష్మి, శీలం గనికమ్మ, గుత్తుల నాగమణి, షేక్ నాగూర్‌బేబి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణకు ప్రాధాన్యం



సోమేశ్వరంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

రాయవరం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంరక్షణకు పోషణ్ భీ..పడాయి భీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సునీత, విష్ణుకుమారి, మాణిక్యం, వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని సోమేశ్వరంలో శుక్రవారం పోషణ్ భీ..పడాయి భీ కార్యక్రమం నిర్వహించారు. కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎ.గజలక్ష్మి ఆధ్వర్యంలో సాక్ష్యం అంగన్‌వాడీ, మిషన్ పోషణ్ 2.0 కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లకు విద్యా నాణ్యతపై ప్రత్యేక శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేదీ వరకూ మూడు రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మూడేళ్ల లోపు చిన్నారులకు నవ చైతన్య, మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ శిల అనే పాలసీలపై నిప్కో సంస్థ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులు డి.ఆదిలక్ష్మి, ఎస్.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర డిగ్రీ కళాశాలల వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణ



వెంకటరమణ

రామచంద్రపురం: ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని రామచంద్రపురం వికాస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వాసంశెట్టి వెంకట రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆయన శుక్రవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1145 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సర్వసభ్య సమావేశం విజయవాడలో నిర్వహించామని ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు వెంకటరమణ తెలిపారు. పట్టణానికి చెందిన పలు కళాశాలల కరస్పాండెంట్స్, ప్రముఖులు వెంకటరమణకు అభినందనలు తెలిపారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఘన నివాళి



ద్రాక్షారామలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రామచంద్రపురం రూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలిపెట్టిన విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ద్రాక్షారామ శ్రీనివాస శైల ఐటీఐ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా నివాళులర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ విప్లవ వీరులు చిన్న వయస్సులోనే దేశ విముక్తి కోసం, దోపిడీ, పీడన, అసమానతలు లేని సమాజం కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఇప్పటికి 94 ఏళ్లు అవుతుందన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని కార్పొరేట్ శక్తులకు, సామ్రాజ్యవాద దేశాలకు అడుగులకు మడుగులు వత్తుతున్న ఎన్డీఏ ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల లెక్చరర్ రాజు, పీడీఎస్‌యూ నాయకులు కరుపోతు నవీన్‌కుమార్, కె.వరప్రసాద్, తారక ముఖేశ్, దుర్గాప్రసాద్, ప్రసన్న, ధనుష్, భీమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి



చీకట్లవారిపేటలో విగ్రహ ప్రతిష్ఠకు సిద్ధంగా నూతన రామాలయం

కాజులూరు: గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట, గుండారం కాలనీలలో నూతనంగా నిర్మించిన రామాలయాలలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహక కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రామంలోని చీకట్లవారిపేటలోని రామాలయం శిథిలావస్థకు చేరుకోవటంతో గ్రాస్తులు ప్రభుత్వ నిధులతో పాటు కొంత ప్రజావిరాళంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. అదేవిధంగా గుండారం కాలనీలో గ్రామస్తులు ప్రభుత్వ నిధులతో పాటు కొంత ప్రజావిరాళంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. రెండు ఆలయాలలోనూ శనివారం కలశ స్థాపన చేసి గణపతి హోమం నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయంలో విగ్రహాలకు సంప్రోక్షణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టి సోమవారం ఉదయం తొమ్మిది గంటల 24 నిమిషాలకు ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠ చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని భక్తకమిటీ సభ్యులు కోరుతున్నారు.

ఈ-కేవైసీ 94 శాతం పూర్తి



వెల్లలో రైతులకు ఈ-పంట నమోదు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలో రబీ సీజన్ 2024–25కు సంబంధించి ఈ–పంట నమోదు, రైతుల ఈ–కేవైసీ 94 శాతం పూర్తయినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఏఓ మండలంలోని వెల్ల గ్రామంలో రైతులకు ఈ పంట ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ–పంట నమోదయినట్లు ప్రతి రైతు ఫోన్‌కీ ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితోనే లక్ష్యసాధన



కుయ్యేరు మండల పరిషత్ పాఠశాలలో భోజనశాలను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి పట్టుదలతో చదివి ఉన్నత విద్యలు అభ్యసించినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నత స్థితిని పొందగలుగుతారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుయ్యేరు మండల పరిషత్ పాఠశాలలో స్థానిక దాత, మండల క్షత్రియ పరిషత్ సభ్యుడు జంపన శ్రీనివాసరాజు స్వచ్ఛంద విరాళంతో నిర్మించిన భోజనశాలను, సరస్వతీదేవి మందిరాన్ని మంత్రి సుభాష్ ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యే విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశిస్తుందన్నారు. భోజనశాల, సరస్వతీదేవి విగ్రహాలను నిర్మించిన దాత జంపన శ్రీనివాసరాజును మంత్రి సుభాష్ అభినందించారు. అనంతరం జెడ్పీ పాఠశాలను ఆనుకని ఉన్న చెరువుగట్టును ఆటస్థలంగా అభివృద్ధి చేయాలని, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు మంత్రికి వినతిపత్రాలు సమర్పించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఎంఈఓ డేవిడ్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అధునాతన చికిత్సపై అవగాహన పెంచుకోవాలి



డాక్టర్లను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

మండపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా పీఎంపీలు అధునాతన శస్త్ర చికిత్సలపై అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి శస్త్ర చికిత్స వైద్య నిపుణుడు డాక్టర్ రిమ్మలపూడి నితిన్ సూచించారు. కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం ఆలమూరు రోడ్డులోని సూర్య గ్రాండ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా మండపేట, ఆలమూరు, రాయవరం మండలాల సంఘ సభ్యులకు అధునాతన చికిత్సలపై అవగాహన కల్పించారు. డాక్టర్లు దివ్య, కె.నాగేశ్వరరావు పీఎంపీల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, నాయకులు సూరంపూడి వీరభద్రరావు, మట్టా వీరబాబు, ఎన్‌వీ రమణ, బల్లా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి ఇరవాడ రవికుమార్, ఉపాధ్యక్షుడు బీవీ రమణ, డెల్టా హాస్పిటల్ మేనేజర్ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో తాచుపాము హల్‌చల్



పామును పట్టుకున్న స్నేక్ స్నాచర్

మండపేట: పట్టణంలోని 16వ వార్డు కంచరవీధిలో శుక్రవారం తాచుపాము హల్‌చల్ చేసింది. వివరాల్లోకి వెళితే.. కంచరవీధిలోని రెండంతస్తుల భవనంపై అంగర సత్తిబాబు అనే వ్యక్తి నివాసముంటున్నారు. గురువారం రాత్రి 9:30 గంటలకు పని మీద మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకున్న సత్తిబాబు కుమారుడు మెట్ల మీద నుంచి ఇంట్లోకి వెళ్లబోతున్నాడు. అప్పటికే అక్కడ తిష్ట వేసిన తాచుపాము యువకుడిపై పడగ విప్పి కాటేయబోయింది. తీవ్ర భయాందోళనకు గురైన యువకుడు పక్కింటి సందులోకి దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. యువకుడు కేకలు వేయడంతో ఇంట్లో ఉన్నవారు లైట్లు వేసి బయటకు వచ్చి చూసేసరికి పాము మెట్ల ఇరుకులోకి దూరేసింది. స్నేక్‌స్నాచర్‌కు సమాచారం ఇవ్వడంతో అతను పామును పట్టుకుని అది గోధుమ తాచు అని తెలిపాడు.

ఆడిట్ అనంతరం జరిమానా విధింపు



ఉపాధి హామీ పబ్లిక్ హియరింగ్ సభ

రామచంద్రపురం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో రామచంద్రపురం మండలంలోని 25 పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ గ్రామ సభలు ఈ నెల 19 నుంచి 27 వరకు నిర్వహించారు. వీటిపై ఫైనల్ పబ్లిక్ హియరింగ్ రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించారు. రికవరీల రూపంలో రూ.38,058, ఫైన్‌ల రూపంలో రూ.6,536 విధించడం జరిగిందని ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), అంబుడ్స్‌మన్ అడపా శ్రీనివాసరావు, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఏపీఓ మోర్త ఈశ్వరరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సాంకేతిక సహాయకులు, ఉపాధి హామీ పథకం వేతనదారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సారా కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, సర్పంచ్ కిన్నెర

మండపేట: సారా కేసులో పట్టుబడిన వారిపై పీడీ యాక్టు నమోదు అవుతుందని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ అమర్‌బాబు తెలిపారు. మండలంలోని ద్వారపూడి పంచాయతీ వద్ద శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులు నవోదయం 2.0లో భాగంగా సారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ చట్టరీత్యా నేరమన్నారు. సారా తయారీకి పాల్పడినా, క్రయ విక్రయాలు జరిపినా పీడీ యాక్టు నమోదు చేయడం ఖాయమన్నారు. సర్పంచ్ కిన్నెర మాట్లాడుతూ సారాకు బానిసలై జీవితాలు పాడు చేసుకోవద్దని సూచించారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలమూరు ఎక్సైజ్ ఎస్సై రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రమణ, వీఆర్వో, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలోని మూడు భవిత కేంద్రాల్లోని దివ్యాంగ చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం మండల భవిత కేంద్రాన్ని మంత్రి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం సీఎస్ఆర్ నిధులు కేటాయించి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీల కోసం అవసరమైన పరికరాలు కొనుగోలు చేస్తామన్నారు. అదే విధంగా చిన్నారులు భవిత కేంద్రానికి రావడానికి, తిరిగి వెళ్లడానికి రెండు ఆటోలు కొనుగోలు చేస్తామన్నారు. చిన్నారులను పూర్తిగా సంరక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంఈఓలు వీర రాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, భవిత కేంద్రం నిర్వాహకులు బాబు, నాగమణి పాల్గొన్నారు.

జ్వర పీడితుల వివరాలు సమగ్రంగా ఉండాలి

అంబాజీపేట: గ్రామంలో ప్రతి ఇంటినీ సర్వే చేసి జ్వర పీడితుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం దంగేటివారిపాలెంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు పర్యవేక్షణలో కమ్యూనిటీ హెల్త్ అధికారి బి.అప్పారావు, సబ్ యూనిట్ అధికారి ఎన్‌వీ రామారావుల ఆధ్వర్యంలో యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం కారణంగా ప్రతి ఒక్కరూ రోగాల బారిన పడుతున్నారన్నారు. అలాగే దోమల ఉధృతి అధికంగా ఉందని వాటి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నివాస ప్రాంతాల్లో ఉన్న మురుగు కాలువలు, డ్రైనేజీలు, చెత్తా చెదారాన్ని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల ఉధృతి లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నివారించాలన్నారు. దోమల వల్ల విష జ్వరాలతో పాటు డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. అనంతరం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

యువతి అదృశ్యంపై కేసు

కె.గంగవరం: మండలంలోని అద్దంపల్లి గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి అదృశ్యమయింది. పామర్రు ఎస్సై జానీ బాషా తెలిపిన వివరాల ప్రకారం అద్దంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ వెంకటరమణ దంపతుల కుమార్తె ఈ నెల 24న రాత్రి ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీనిపై యువతి తల్లి లక్ష్మి కె.గంగవరం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.